7

సాక్షి నంద్యాల

శుక్రవారం ¦ 21 ¦ మార్చి ¦ 2025



పశువైద్యానికి 'పరీక్ష'!
కర్నూలు నగరంలోని బహుళార్థ పశువైద్య శాలలో అరకొర సేవలు అందుతున్నాయి. మూగ జీవాలకు పరీక్షలన్నీ బయటకే రాస్తున్నారు. అవసరమైన మందులు కూడా లేవు. 8లో▸



మల్లన్నకు నృత్య నీరాజనం
శ్రీశైలంటెంపుల్: ధర్మపథం కార్యక్రమంలో భాగంగా గురువారం నిత్యకళావేదికపై నెల్లూరుకు చెందిన బాలికలు సంప్రదాయ నృత్య ప్రదర్శన నిర్వహించారు.



టీడీపీ నేతలా.. మజాకా
ఉమ్మడి కర్నూలు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు అధికారులపై టీడీపీ నాయకులు జులుం ప్రదర్శిస్తున్నారు. అవుట్ సోర్సింగ్ ఏజెన్సీ తమ వాళ్లకే దక్కాలని రభస సృష్టించారు. 8లో▸

రంజాన్ వేళలు

	ఇఫ్తార్	సహెర్
కర్నూలు	సా॥ 6:34	ఉ॥ 4:59
ఆదోని	సా॥ 6:33	ఉ॥ 4:58
నంద్యాల	సా॥ 6:31	ఉ॥ 4:59
ఆత్మకూరు	సా॥ 6:30	ఉ॥ 4:54
బనగానపల్లె	సా॥ 6:32	ఉ॥ 4:57

హదీస్ వెలుగు:
ఉపవాస దీక్షలు పాటించేవారి పట్ల మృదు స్వభావం కలిగి ఉండండి. వారి పట్ల కఠినత్వం చూపే వారి పట్ల అల్లాహ్ కూడా కఠినంగా ఉంటాడు. – పవిత్ర ఖురాన్

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం
నంద్యాల(న్యూటౌన్): మహాత్మా జ్యోతిరావు పూలే ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో ఇంటర్మీడియెట్, 5వ తరగతి, బ్యాక్‌లాగ్ అడ్మిషన్ల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు గురుకుల పాఠశాల నంద్యాల జిల్లా కన్వీనర్, ప్రిన్సిపాల్ ఫ్లోరమ్మ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 15వ తేదీ నుండి 25వ తేదీ వరకు దరఖాస్తులను https:// mjpapbcwreis.apcfss.inలో నమోదు చేసుకునేందుకు గడువు పొడిగించినట్లు తెలిపారు. మరింత సమాచారం కోసం 9866559668, 9440725929 నంబర్లను సంప్రదించాలన్నారు.

ఉపాధ్యాయుడి సస్పెన్షన్
నంద్యాల: ప్యాపిలి మండలం ఏనుగుమర్రి గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న సాంఘికశాస్త్ర స్కూల్ అసిస్టెంట్ ఎం. బొజ్జన్నను సస్పెండ్ చేసినట్లు జిల్లా కలెక్టర్ రాజకుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విధుల నిర్వహణలో తీవ్ర అలసత్వం వహించడమే కాకుండా విద్యార్థినులపై అసభ్యంగా, దురుసుగా ప్రవర్తించినట్లు మండల విద్యాశాఖ అధికారి, డిప్యూటీ విద్యాశాఖ అధికారి నివేదిక అందించారన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ ప్రజలు రాతపూర్వకంగా కూడా ఫిర్యాదు చేసినట్లు నివేదికలో పొందుపరిచారని పేర్కొన్నారు. ఉపాధ్యాయుల నీతి, నియమావళి (ఆర్టీఈ ఏసీటీ సెక్షన్-17)ని ఉల్లంఘించినట్లు నిర్ధారణ అయినందున ఉపాధ్యాయుడు ఎం.బొజ్జన్నను సస్పెండ్ చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.

ఇఫ్తార్ విందులో సామరస్యం



ఇఫ్తార్ భోజనం వడ్డిస్తున్న దృశ్యం

బేతంచెర్ల: హిందువులు, ముస్లింలు కలసిమెలసి ఉంటున్నారు. పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని ఉపవాస దీక్షలు చేస్తున్న ముస్లింలకు హిందువులు ఇఫ్తార్ విందు ఇచ్చారు. బేతంచర్ల పట్టణంలోని షాదీఖానాలో శివ గురుస్వామి బుగ్గన మహేశ్వర్‌రెడ్డి, మాలధారులు సుబ్బారెడ్డి, జయరాముడు, వెంకటేశ్వర్లు గురువారం ముస్లింలకు ఇఫ్తార్ విందును వడ్డించారు. వారిని మతసామరస్య చైతన్య వేదిక అధ్యక్ష, కార్యదర్శులు నూర్ అహ్మద్ , మహమ్మద్ గౌస్, జయంత్ గౌడ్, షాలీబేగ్ అభినందించారు.

ఆసుపత్రిలో చేరిన గిరిజన బాలుడు



బాలుడికి వైద్యం చేస్తున్న వైద్య సిబ్బంది

ఆత్మకూరు: మెరుగైన వైద్యం కోసం గిరిజన బాలుడు పులిచెర్ల నాగన్న నంద్యాలలోని జీఎస్ఆర్ ఆసుపత్రిలో గురువారం చేశారు. ఆత్మకూరు పట్టణంలోని వెంగళరెడ్డి నగర్ కాలనీకి చెందిన ఈ బాలుడు ఇటీవల మిద్దె నుంచి కింద పడ్డాడు. కాలు విరగడంతో మంచానికే పరిమితం అయ్యారు. ఈ బాలుడి దుస్థితిపై సోషల్ మీడియాలో పోస్టులు వైరల్ కావడంతో నంద్యాల జిల్లా కలెక్టర్ స్పందించారు. ఆ బాలుడికి సత్వర వైద్యం అందించాలని జిల్లా వైద్యాధికారులను ఆదేశించారు. ఈ మేరకు గురువారం బైర్లూటి వైద్యాధికారి పవన్‌కుమార్ సిబ్బందితో బాలుడి ఇంటి వద్దకు వెళ్లి పరిస్థితిని సమీక్షించి 108 వాహనాన్ని పిలిపించి స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తీసుకెళ్లి వైద్యం అందించారు. అక్కడి నుంచి నంద్యాలలోని జీఎస్ఆర్ ఆసుపత్రిలో చేర్పించి తగిన చికిత్సలు అందించారు. ఆరోగ్యశ్రీ కింద బాలుడికి ఆపరేషన్ చేయించడం కోసం అడ్మిట్ చేశామని వారు తెలిపారు.

సరదాగా మునుగుతూ.. విషాదమై తేలుతూ!

- ఈతకు వెళ్లి నీట మునుగుతున్న నిండు ప్రాణాలు
- ప్రాణాలను బలిగొంటున్న బావులు, కుంటలు
- ఉమ్మడి జిల్లాలో ఐదు రోజుల వ్యవధిలో ఐదుగురు మృత్యువాత
- ఈతపై అవగాహన లేక అనర్థాలు



సర్పిపల్లె వద్ద కుందూనదిలో అస్రఫ్ మృతదేహాన్ని బయటకు తెస్తున్న గజ ఈతగాళ్లు (ఫైల్)

కోవెలకుంట్ల: ఓ వైపు ఎండలు మండుతున్నాయి. మరో వైపు స్కూళ్లకు ఒంటి పూట తరగతులు ప్రారంభమయ్యాయి. మధ్యాహ్న సమయంలో పిల్లలు ఈత నేర్చుకునేందుకు ఊళ్లల్లోని బావులు, చెరువులు, కాలువల వద్దకు వెళ్లి ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈత సరదా ప్రాణాలు తీస్తోంది. నీటి లోతు తెలియకపోవడం, సుడులు, జల గుండాలు.. కారణాలు ఏవైనా నిండు ప్రాణాలు నీటిలో కలిసిపోతున్నాయి. ఉమ్మడి జిల్లాలో ఏటా చాలా మంది ప్రాణాలు కోల్పోతున్నారు. మధ్యాహ్నం పాఠశాలల నుంచి ఇళ్లకు వచ్చిన విద్యార్థులకు కుందూనది, వాగులు, బావులు, కాలువలు, చెరువుల్లో ఈత కొట్టేందుకు వెళ్తూ ప్రమాదాల బారిన పడుతున్నారు. పేద, సామాన్య, మధ్య తరగతి కుటుంబాల్లోనే ఎక్కువగా ఈ సంఘటనలు జరుగుతున్నాయి. రెక్కాడితే కాని డొక్కాడని కుటుంబాల్లో తల్లిదండ్రులు వ్యవసాయ, ఉపాధి, నాపరాతిగనులు, ఇతర కూలీ పనులకు వెళుతూ పిల్లలను చదివించుకుంటూ కాలం వెల్లదీస్తున్నారు. ఉన్నత చదువులు చదివి ప్రయోజకులై భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకుంటారనుకుంటే ఈత సరదా ఆ కుటుంబాలకు కడుపుకోత మిగుల్చుతోంది.

బావులు, కుంటల్లోని నీటి లోతును అంచనా వేయకపోవడం, ఈత రాకపోవడం, ఇంట్లో పెద్దలకు చెప్పకుండా ఈతకు వెళ్లడం, ఈత కొట్టే సమయంలో పెద్దవారెవరూ అక్కడ లేకపోవడం వల్లే ఈతకు వెళ్లిన పిల్లలు ప్రమాదశాత్తు నీట మునిగి విగతజీవులుగా మారి తల్లిదండ్రులకు పుత్రశోకం కల్గిస్తున్నారు. ప్రతి ఏటా మార్చి, ఏప్రిల్ నెలల్లో ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయి. ఎండలు అధికంగా ఉన్న కారణంగా నలుగురు స్నేహితులు ఒక చోట చేరి ఈతకు వెళ్లాలన్న ఆలోచన రావడమే ఆలస్యం.. వెనకా, ముందు చూడకుండా నదులు, బావులకు వెళ్లి ప్రాణాలు కోల్పోతున్నారు. పిల్లల తల్లిదండ్రులు వారికున్న పనుల కారణంగా తమ పిల్లలు ఎక్కడికెళ్లారోనని గమనించకపోవడం వల్లే భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తోంది.

ఐదు రోజుల్లో ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఘటనలు

తేదీ	ఊరు	ప్రమాదం	మృతుడు (వయస్సు)
19న	కొత్తపల్లి మండలం సంగమేశ్వరం	కృష్ణానది బురద నీటిలో దిగబడి	సందీప్ కుమార్ (23)
18న	ఉయ్యాలవాడ మండలం సర్పివల్లె	కుందూలో మునిగి	అస్రఫ్ (18)
18న	చిప్పగిరి	బావి పూడికలో కూరుకపోయి	సుభాష్ (11)
16న	పాములపాడు మండలం గుండాలనట్టు	బావిలో మునిగి	అమూల్య రాజు (13)
15న	ఆదోని మండలం బసాపురం	ఎల్లెల్సీ కాలువలో నీట మునిగి	హరికృష్ణ (16)



కుందూనదిలో ఈత కొడుతున్న బాలలు

హెచ్చరిక బోర్డులు ఏవీ..
నదులు, వాగులు, వంకల్లో ఇసుక అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. తుంగభద్ర, హంద్రీ, కుందూ నదులు, వాగుల్లో ఇసుక కొల్లగొట్టడంతో పలు చోట్ల పెద్ద గోతులు ఏర్పడ్డాయి. ఈ గుంతల్లో నీరు నిల్వడంతో ఈత కొట్టేందుకు వెళ్లిన పిల్లలకు లోతు తెలియక ప్రమాదాల బారిన పడుతున్నారు. పలు బావుల్లో పూడిక ఉండటం, ఎత్తైన చోటు నుంచి దూకినప్పుడు పూడికలో కూరుకపోయి చనిపోతున్నారు. అయితే ఇలాంటి ప్రదేశాల వద్ద ఎవరూ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.

పిల్లలను బావులు, నదుల వైపు పంపకూడదు



పాఠశాలలకు సెలవులొస్తున్నాయంటే పిల్లల ఆనందానికి అవధులు ఉండవు. గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువ శాతం మంది పిల్లలు వేసవి కాలంలో బావులు, కుంటలు, చెరువుల్లో ఈత కొట్టేందుకు మక్కువ చూపిస్తారు. అవి లోతు ఎక్కువగా ఉంటాయన్న అవగాహన ఉండదు. ఈత రాదనే ఆలోచన రాదు. ఈ కారణంగానే ఈతకు వెళ్లిన పిల్లలు నీట మునిగి ఊపిరాడక మృత్యువాత పడుతున్నారు. సెలవుల్లో పిల్లల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలి. పాఠశాలల నుంచి ఇంటికి వచ్చిన తర్వాత పిల్లల రోజువారీ కార్యక్రమాలను గమనిస్తుండాలి.

– డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, చిన్న పిల్లల వైద్యనిపుణుడు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్, కోవెలకుంట్ల

తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి



సెలవుల్లో పిల్లల పట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా వ్యవహరించాలి. నది, బావులు, కుంటల్లో ఈతకు వెళ్లకుండా గమనిస్తుండాలి. ఒక వేళ ఈత కొట్టాలని పిల్లలు మారం చేస్తే సాధ్యమైనంత వరకు ఆ ఆలోచన నుంచి వారిని మళ్లించాలి. అవసరమైతే వారితో పాటు పెద్దలు కూడా వెళ్లాలి. ఈతకు బదులు ఇంటి పరిసర ప్రాంతాల్లో ఆడుకునే ఆటలవైపు దృష్టి మళ్లేలా అవగాహన కల్పించాలి.

– జీవీ సుబ్బారెడ్డి, రిటైర్డ్ హెచ్ఎం, కోవెలకుంట్ల

క్రీడలతో పాటు ఈత నేర్పించాలి



పిల్లలకు వేసవి సెలవుల్లో క్రీడలతోపాటు ఈతలో శిక్షణ ఇప్పించాలి. విద్యార్థులకు చాలా మంది ఈత రాక ప్రమాదాల బారిన పడి మృత్యువాత చెందుతున్నారు. ఈత వచ్చిన వారి సమక్షంలో పిల్లలకు ఈత నేర్పించాలి. చెరువులో, నీటి కుంటల లోతు తెలియకుండా దిగవద్దు. డైవ్ చేయకూడదు. ఈత నేర్చుకునేవారు తప్పనిసరిగా లైఫ్ జాకెట్లను ధరించాలి. అలసట వచ్చేంత వరకు ఎక్కువ దూరం ఈత కొట్టరాదు.

– ఉపేంద్ర, పీఈటీ, కోవెలకుంట్ల

విహారయాత్రలో విషాదం

- పాతాళగంగలో స్నానానికి వెళ్లి యువకుడి మృతి
- మృతుడు కరీంనగర్ జిల్లా జమ్మికుంట వాసి



మృతిచెందిన సాయితేజ

శ్రీశైలం: స్నేహితులతో కలిసి స్నానానికి వెళ్లిన యువకుడు హఠాత్తుగా నీటిలో మునిగి మృతి చెందాడు. శ్రీశైలం వన్ టౌన్ పోలీసులు కథనం మేరకు.. గురువారం కరీంనగర్ జిల్లా జమ్మికుంట గ్రామానికి చెందిన సీహెచ్ సాయితేజ(18) ఐదుగురు స్నేహితులతో కలిసి శ్రీశైలానికి విహారయాత్రగా వచ్చాడు. పాతాళగంగలో స్నానాలు చేస్తుండగా సాయితేజ ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయాడు. అక్కడ మత్స్యకారులు సాయితేజ మృతదేహాన్ని నీటిలోంచి బయటికి తీసుకువచ్చి పోలీసులకు సమాచారం అందజేశారు. హైదరాబాద్‌లోని కులీ కుతుబ్‌షా గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాలలో సాయితేజ పాలిటెక్నిక్ చదువుతున్నారని వారి స్నేహితులు తెలిపారు. విహారయాత్రగా శ్రీశైలానికి వచ్చి స్నేహితుడు ప్రాణాలు కోల్పోవడంతో వారు తీవ్ర విషాదానికి లోనయ్యారు. సమాచారాన్ని వారి బంధువులకు తెలియజేసి కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కొందరికే 'మాతృత్వ వందన'ం

- జిల్లాలో 11,204 మంది గర్భిణుల రిజిస్ట్రేషన్
- 3,666 మందికి మాత్రమే పీఎంఎంవీవైకి నగదు జమ

సంవత్సరం	నమోదు అయిన గర్భిణులు	రిజిస్ట్రేషన్ చేసిన గర్భిణులు	నగదు జమైన వారి సంఖ్య
2023-24	31,011	8,409	3,585
2024-25	28,122	2,795	81



గోస్పాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు, బాలింతలకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

గోస్పాడు: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి మాతృత్వ వందన యోజన (పీఎంఎంవీవై) జిల్లాలో కొంత మంది గర్భిణులకే అందుతోంది. ఈ పథకానికి సంబంధించిన మొత్తం సొమ్ము (రూ.6వేలు) ఆయా గర్భిణులకు సకాలంలో అందడం లేదు. ప్రభుత్వం అందించే సొమ్ము ఎప్పుడొస్తుందో అధికారులకే తెలియని పరిస్థితి నెలకొంది. ఈ పథకాన్ని 2010లో అప్పటి కేంద్ర ప్రభుత్వం ఇందిరా గాంధీ మాతృత్వ సహయోగ్ యోజన (ఐజీఎంఎస్‌వై)గా ప్రారంభించింది. ఈ పథకాన్ని 2016లో ప్రధానమంత్రి మాతత్వ వందన యోజనగా ప్రధాని నరేంద్రమోదీ మార్పు చేశారు. ఈ పథకం మరింత మందికి లబ్ధి చేకూరాలని ఉద్దేశంతో కొన్ని మార్పులు చేసిన తర్వాత అమల్లోకి తీసుకువచ్చారు. పీఎంఎంవీవై ద్వారా అందించే నగదు.. గర్భిణులు, బాలింతల్లో మెరుగైన ఆరోగ్య కల్పనకు, నవజాత శిశు సంరక్షణకు, వ్యాధుల నివారణకు ఉపయోగపడుతుంది.

రిజిస్ట్రేషన్ ఇలా..
జిల్లాలో 29 మండలాలు ఉండగా 52 పీహెచ్‌సీలు, 16 అర్బన్ హెల్త్‌సెంటర్లు, 11 సీహెచ్‌సీలు, రెండు ఏరియా, జిల్లా ఆసుపత్రి పరిధిలో మొత్తం 59,133 మంది గర్భిణులు రెండేళ్లలో నమోదయ్యారు. వారిలో 11,204 మంది గర్భిణులు పీఎంఎంవీవై కింద రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. 2023 ఏప్రిల్ నుంచి 2025 వరకు 3,666 మందికి మాత్రమే వారికి పీఎంఎంవీవై కింద నగదు అందినట్లు వైద్యశాఖ అధికారులు చెబుతున్నారు. మొదటి కాన్పులో ఆడ, మగ ఎవరో ఒకరు జన్మించినా, రెండో కాన్పులో కేవలం ఆడబిడ్డ మాత్రమే జన్మించిన వారు మాత్రమే పీఎంఎంవీవైకు అర్హులు. రెండు కాన్పులకు మించి ప్రసవాలు చేసుకునే వారికి అనర్హులు. గర్భం దాల్చిన మూడు నెలల్లోపు మాతృత్వ వందన పథకానికి వార్డు, గ్రామ సచివాలయంలోని వెల్‌నెస్ సెంటర్లో పేరును నమోదు చేయించుకోవాల్సి ఉంది. అయితే గర్భిణుల నమోదు ప్రక్రియ ఒకలా ఉండటుండగా ఈ పథకానికి మాత్రం కొందరు మాత్రమే అర్హత సాధిస్తున్నారు.

విడతల వారీగా నగదు చెల్లింపు
- గర్భం దాల్చిన నాటి నుంచి ప్రసవం పూర్తయ్యేలోపు కేంద్ర ప్రభుత్వం ప్రోత్సాహంగా విడతల వారీగా రూ.ఐదు వేలు చెల్లిస్తుంది.
- గర్భిణికి మూడు నెలలలోపు మొదట రూ. రెండు వేలు బ్యాంకు ఖాతాలో జమవుతుంది.
- ఆరునెలల పాటు క్రమం తప్పకుండా వైద్యుల పర్యవేక్షణ తీసుకున్న గర్భిణికి ప్రసవం అయిన 14వ వారం రూ. మూడు వేలు అందనుంది.
- రెండోకాన్పులో ఆడబిడ్డ పుట్టిన వారికి మాత్రం విడతల వారీగా కాకుండా ఒకేసారి రూ. ఆరు వేలు అందించనున్నారు.

ఇబ్బందులు లేకుండా చేస్తున్నాం



ప్రతి నెలా గర్భిణులకు ప్రత్యేక వైద్య సేవలు అందిస్తున్నాం. నిర్దిష్ట సమయంలో గర్భిణుల వివరాల నమోదు చేసుకుని పథకం లబ్ధిని పొందేలా వైద్యసిబ్బంది చర్యలు చేపడుతున్నారు. ఆరోగ్య సిబ్బందికి, అంగన్‌వాడీలకు అవగాహన కల్పిస్తున్నాం. ఈ పథకం కింద రిజిస్ట్రేషన్ చేసిన గర్భిణులకు మాత్రమే డబ్బులు జమ అవుతాయి.

– వెంకటరమణ, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి

దేవదాయ శాఖ ఈఓల పవర్‌కు 'చెక్'

- ఈఓ, జిల్లా దేవదాయ శాఖ అధికారి పేరిట ఫిక్స్‌డ్ డిపాజిట్లు

కర్నూలు కల్చరల్: దేవదాయ శాఖకు సంబంధించిన ఆలయాలు, సంస్థలకు చెందిన నిధులు దుర్వినియోగం కాకుండా ఆ శాఖ ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు. ఇకపై ప్రతి ఫిక్స్‌డ్ డిపాజిట్ ఈఓతో పాటు సంబంధిత దేవదాయశాఖ అధికారితో కలిపి సంయుక్త పేరిట ఉండాలనే మార్గదర్శకాలను జారీ చేశారు. ఆలయాలకు చెందిన ఫిక్స్‌డ్ డిపాజిట్ (ఎఫ్‌డీ) నిధులను కొందరు ఈఓలు గుట్టుచప్పుడు కాకుండా తీసుకుని సొంతంగా వాడుకుంటున్నారు. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో ఇద్దరు ఈఓలు వారి పరిధిలోని దేవాలయాల ఎఫ్‌డీలను స్వాహా చేశారు. వారిపై కేసులు పెట్టి సస్పెండ్ చేశారు తప్ప నిధులు రికవరీ చేయడంలో జాప్యం చేస్తున్నారు. ఎఫ్‌డీలు స్వాహా కావడంతో మేల్కొన్న దేవదాయ శాఖ ఉన్నతాధికారులు ఈఓల పరిధిలో ఉన్న ఆలయాల్లోని ఫిక్స్‌డ్ డిపాజిట్లను గ్రూప్‌ల వారీగా తనిఖీ చేయించారు. దీనికి సైతం కొందరు ఈఓలు సహకరించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో ఒక్కొక్కరు, వైఎస్సార్ కడప జిల్లాలో ఇద్దరు ఈఓలు వారి ఆలయాల ఎఫ్‌డీల పరిశీలనకు సహకరించడం లేదని తెలిసింది. ఈ నేపథ్యంలో ఇకపై ప్రతి ఫిక్స్‌డ్ డిపాజిట్ ఈఓతో పాటు సంబంధిత దేవదాయశాఖ అధికారితో కలిపి సంయుక్త పేరిట ఉండాలనే ఆదేశాలు ఇచ్చారు.

కమిషనర్ ఆదేశాలు పాటించాలి



కర్నూలు, నంద్యాల, కడప జిల్లాల్లో ని ఈఓలు నలుగురు ఇంకా వారికి సంబంధించిన గ్రూప్ టెంపుల్స్ ఎఫ్‌డీల ఫైల్స్‌ను చూపించడం లేదు. వారికి షోకాజ్ నోటీసులు జారీ చేశాం. దేవదాయ శాఖ కమిషనర్ ఆదేశాలను ప్రతి ఒక్కరూ పాటించాలి.

– పి. గురుప్రసాద్, డిప్యూటీ కమిషనర్, దేవాదాయ శాఖ

ఫార్మసీ ఉద్యోగ నియామక ప్రక్రియ నిలిపివేత
కర్నూలు(హాస్పిటల్): కడప జోన్-4 పరిధిలో కాంట్రాక్టు ఫార్మసీ ఆఫీసర్ ఉద్యోగాల నియామక ప్రక్రియ హైకోర్టు ఉత్తర్వుల మేరకు తాత్కాలికంగా నిలిపివేసినట్లు వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ అధికారి డాక్టర్ బి.రామగిడ్డయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. హైకోర్టు నుంచి తదుపరి ఉత్తర్వులు వచ్చిన తర్వాత నియామక ప్రక్రియ చేపడతామన్నారు. ఈ విషయాన్ని ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు గమనించాలని కోరారు.

నేడు ఖజానా శాఖ డైరెక్టర్ రాక
కర్నూలు (అగ్రికల్చర్): ఖజానా, లెక్కల శాఖ డైరెక్టర్ మోహన్‌రావు శుక్రవారం కర్నూలుకు రానున్నారు. ఈ నెల 17 నుంచి 22వ తేదీ వరకు జిల్లా ట్రెజరీ, సబ్ ట్రెజరీల్లో 2024-25లో జరిగిన లావాదేవీలపై ఖజానా శాఖ వార్షిక తనిఖీ నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా ఖజానా శాఖ డైరెక్టర్ మోహన్‌రావు కర్నూలుకు రానున్నారు. శుక్రవారం ఉదయం 9:30 గంటలకు కలెక్టరేట్‌లోని స్ట్రాంగ్ రూమ్‌ను తనిఖీ చేయనున్నారు. అనంతరం బి.క్యాంప్‌లోని ట్రెజరీ కార్యాలయానికి వెళ్లి పరిశీలిస్తారు.

పిన్నాపురంలో భారీగా భూ అవకతవకలు



తహసీల్దార్‌తో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి

- వందేళ్ల నుంచి సాగులో ఉన్న వారిని కాదని కొత్తవారికి సర్వే రిపోర్టు
- వెంటనే చర్యలు తీసుకోవాలి
- రైతులతో కలిసి తహసీల్దార్‌ను కలిసిన కాటసాని

పాణ్యం: సోలార్ పరిశ్రమ విస్తరిస్తున్న నేపథ్యంలో పాణ్యం మండలం పిన్నాపురం గ్రామంలో భారీగా భూ అవకతవకలు జరుగుతున్నాయని వైఎస్సార్ సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. పిన్నాపురం గ్రామ బాధిత రైతులతో కలసి గురువారం రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి దృష్టికి సమస్యలు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా కాటసాని మాట్లాడుతూ.. పిన్నాపురం గ్రామంలోని సర్వే నంబర్ 217లో మూడు ఎకరాల సాగు భూమి ఉందన్నారు. ఈ సర్వే నంబర్‌లోని భూమిని పాలూరు పెద్ద వెంకటస్వామి, పాలూరు తిమ్మనాయుడు, పాలూరు పెద్ద ఆంజనేయులు, పాలూరు చిన్నమ్మ, పాలూరు వెంకటమ్మ, పాలూరు సుబ్బమ్మలు వారసత్వంగా సాగు చేస్తున్నారన్నారు. వీరికి పట్టాదారు పాస్‌పుస్తకాలు ఉన్నాయని తెలిపారు. సోలార్ పరిశ్రమ ఏర్పాటు చేసేవారు.. ఒక్కో రైతుకు రూ. 50వేలు చెక్కును పరిహారం కింద అందించారన్నారు. అయితే ఇదే గ్రామానికి చెందిన శీలం వెంకటరమణ అనే వ్యక్తికి 1.90 సెంట్లు భూమిలో సాగులో ఉన్నట్లు ఎంజాయిమెంట్ సర్టిఫికెట్ ఇచ్చారన్నారు. ఈ సర్టిఫికెట్‌తో శీలం వెంకటరమణ సోలార్ పనులకు అడ్డుపడడమే కాకుండా పొలం నాదంటూ అధికారులకు అధికారి పార్టీ నాయకులతో ఫోన్ చేయించారన్నారు. అధికారులను, బాధిత రైతులను బెదిరిస్తున్నారన్నారు. వందేళ్లుగా అనుభవంలో ఉన్న వ్యక్తులను అధికార పార్టీ అండతో బెదిరించడం దారుణమన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి అన్ని రికార్డులు చూసిన బాధిత రైతులకు న్యాయం చేయాలని తహసీల్దార్‌ను కోరారు. కందికాయపల్లె గ్రామంలో ప్రభుత్వ భూమిని కబ్జాచేసేందుకు సిద్ధపడ్డారని రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. కొత్త వ్యక్తులకు ఇష్టానుసారంగా సర్టిఫికెట్లు జారీ చేసే అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. క్షేత్రస్థాయిలో విచారణ చేసిన రైతులకు న్యాయం చేస్తామని తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి వెంట జెట్పీటీసీ మాజీ సభ్యులు సద్దల సూర్యనారాయణరెడ్డి, మండల అధ్యక్షులు కరుణాకర్‌రెడ్డి, సత్యాలు, రామచంద్రుడు, కో-ఆప్షన్ సభ్యులు జాకీర్ ఉసేన్, ఎల్లక్రిష్ణయ్య, గౌడ్, టైలర్‌బాషా, వెంకటరమణ, స్వామి , బాలిరెడ్డి ఉన్నారు.

'బయో' అమ్మకాలపై తనిఖీలు



తనిఖీలు నిర్వహిస్తున్న వ్యవసాయాధికారులు

నంద్యాల(అర్బన్): పట్టణంలోని ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో బయో ఉత్పత్తుల అమ్మకాలపై వ్యవసాయాధికారులు గురువారం తనిఖీలు నిర్వహించారు. బిల్‌బుక్స్, రసీదులను ఆత్మకూరు ఏడీఏ ఆంజనేయ, నంద్యాల ఏడీఏ రాజశేఖర్ పరిశీలించారు. సరైన ధ్రువపత్రాలు లేకపోవడంతో రూ.16.72 లక్షల విలువైన బయో ఉత్పత్తుల అమ్మకాలను తాత్కాలికంగా నిలుపుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వంతో అనుమతులు పొందిన బయో ఉత్పత్తులనే దుకాణదారులు విక్రయించాలన్నారు.

క్లుప్తంగా

అనుమతి లేని బోట్లు నడిపితే చర్యలు



మూర్వకొండ ఘాట్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్ శివరాముడు

సాక్షి ఎఫెక్ట్

పగిద్యాల: కృష్ణా నదిలో అనుమతి లేని బోట్లు నడిపితే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ శివరాముడు హెచ్చరించారు. 'నిబంధనలు నీట ముంచి.. ప్రయాణికుల రక్షణ మరిచి' అన్న శీర్షికను గురువారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనంపై తహసీల్దార్ స్పందించారు. ఉదయం పోలీస్, రెవెన్యూ సిబ్బందితో కలసి మూర్వకొండ ఘాట్‌ను పరిశీలించి ఘాట్ నిర్వాహకులకు హెచ్చరికలు జారీ చేశారు. కృష్ణానది బ్యాక్‌వాటర్‌లో ఎలాంటి ఇంజిన్ బోట్లు తిప్పరాదని ఆదేశించారు. పోర్ట్ అధికారులు జారీ చేసిన బోటుకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్, డ్రైవింగ్ లైసెన్స్, బోట్ లైసెన్స్ తెచ్చుకోవాలన్నారు. బోట్లు తిప్పకుండా ప్రతి రోజు మూర్వకొండ ఘాట్ వద్ద రెవెన్యూ అసిస్టెంట్లకు బందోబస్తు విధులు వేస్తామన్నారు. తహసీల్దార్ వెంట రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీరంగారెడ్డి, వీఆర్వో వెంకటస్వామి, పోలీసు సిబ్బంది, రెవెన్యూ అసిస్టెంట్లు ఉన్నారు.

ఆదర్శ పాఠశాల ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

నంద్యాల(న్యూటౌన్): ఆదర్శ పాఠశాలల్లో 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి 6వ తరగతిలో ప్రవేశాలకు ఈనెల 31వ తేదీతో దరఖాస్తు గడువు ముగియనుంది. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.150, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.75 పరీక్ష ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. పూర్తి వివరాలు, ఆన్‌లైన్ దరఖాస్తు సమర్పించేందుకు www. cse.ap.gov.in, www.apms. apcfss.in వెబ్‌సైట్ సంప్రదించాలి. ఆరో తరగతిలో ప్రవేశానికి గతేడాది మాదిరిగానే పరీక్ష నిర్వహించనున్నారు. దరఖాస్తు చేసుకున్న మోడల్ స్కూల్లోనే ఏప్రిల్ 20వ తేదీన ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష జరగనుంది. మెరిట్ లిస్ట్ ఆధారంగా రోస్టర్ ప్రకారం సీట్లను కేటాయించనున్నారు. ఏప్రిల్ 27న మెరిట్ లిస్ట్, అదే రోజు సెలక్షన్ లిస్టును సైతం వెల్లడిస్తారు. ఏప్రిల్ 30న సర్టిఫికెట్ల పరిశీలనతో పాటు కౌన్సెలింగ్ ప్రక్రియను చేపట్టనున్నారు. ప్రవేశ పరీక్షలో వచ్చిన మార్కుల ఆధారంగా, రిజర్వేషన్ రూల్స్ ప్రకారం సీట్లు కేటాయిస్తారు. కొత్త విద్యా సంవత్సరం ప్రారంభ తేదీ నుంచి తరగతులు ప్రారంభం అవుతాయి. పేద విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఈఓ జనార్దన్‌రెడ్డి తెలిపారు. ఈ పాఠశాలల్లో ఒక్కసారి సీటు దక్కితే ఇంటర్మీడియట్ పూర్తయ్యే వరకూ చదువుకోవచ్చొన్నారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

జూపాడుబంగ్లా: 16 ఏళ్ల బాలికను ప్రేమిస్తున్నానని నమ్మించి మోసగించిన యువకునిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ లక్ష్మీ నారాయణ గురువారం తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల మేరకు.. భాస్కరాపురం గ్రామానికి చెందిన ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకులో బిజినెస్ కరస్పాండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ప్రశాంత్ జూపాడుబంగ్లా జగనన్న కాలనీలో నివాసం ఉంటున్న ఓ బాలికను ప్రేమిస్తున్నాను, పెళ్లిచేసుకొంటానని నమ్మించాడు. అతని మాటలు నమ్మిన బాలిక చివరకు మోసపోయింది. పెళ్లి చేసుకోకుండా మొహం చాటేయడంతో బాలిక జూపాడుబంగ్లా పోలీసులను ఆశ్రయించింది. ఈ మేరకు ప్రశాంత్‌పై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



కర్రలు కట్టుకుని నడక సాగిస్తూ..



భక్తి పతాకం.. జెండాతో మహిళా భక్తురాలు



ఎండకు టోపీలు రక్షణగా..



దూరాభారమైనా.. నెత్తిన లగేజీతో మహిళలు



శ్రీగిరికి వినిపించేలా.. తప్పెట్ల మోతతో వెళ్తూ..



దారి మధ్యలో సేద తీరుతూ..

శ్రీగిరి వైపు కన్నడిగులు

కర్ణాటక భక్తగణం శ్రీగిరి వైపు అడుగులు వేస్తోంది. శ్రీశైలంలో జరిగే ఉగాది ఉత్సవాల్లో పాల్గొనేందుకు కన్నడిగులు పాదయాత్రగా తరలివస్తున్నారు. భ్రమరాంబ దేవిని తమ ఇంటి ఆడపడుచుగా భావించి చీరసారె సమర్పించి మొక్కులు చెల్లించేందుకు శ్రీశైలం వైపు వెళ్తున్నారు. వందల కి.మీ దూరం నడుచుకుంటూ ఎండలను సైతం లెక్క చేయకుండా వడివడిగా ముందుకు సాగిపోతున్నారు. భజనా కావడీలు, చేత శివయ్య పతకాలతో పాదయాత్రగా వెళ్తున్నారు.. మార్గమధ్యలో కర్ణాటక భక్తుల సేవలో దాతలు తరిస్తున్నారు. కర్నూలు నగర శివారులో అన్నదానం, వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. మరి కొందరు మజ్జిగ, పండ్లు అందజేస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు



భక్తులకు వైద్య సేవ..



దారిలో దాతలు.. భక్తులకు పండ్లు అందజేస్తున్న మహిళ



శివయ్య దండు కదిలింది.. కేజీ రోడ్డు పొడవునా కన్నడ భక్తులు

పశువైద్యానికి 'పరీక్ష'!

బహుళార్థ పశువైద్య శాలలో అరకొర సేవలు

- మూగజీవాలకు పరీక్షలన్నీ బయటికే
- పశువులను ఎక్కడెక్కడో తిప్పాల్సిన పరిస్థితి
- వేధిస్తున్న మందుల కొరత
- చికిత్సకోసం యజమానుల జేబులు ఖాళీ
- మూలనపడిన అధునాతన యంత్రాలు



కోడెదూడకు వైద్య సేవలు అందిస్తున్న దృశ్యం

కర్నూలు(అగ్రికల్చర్): బహుళార్థ పశువైద్యశాల.. కర్నూలు నగరంతో పాటు జిల్లాలోని మూగజీవుల పాలిట వరం. ఏరియా పశువైద్యశాలలు, వెటర్నరీ డిస్పెన్సరీల్లో చేతులెత్తేసిన కేసులకు ఇక్కడి వైద్యులు మెరుగైన వైద్యం అందించడంతో పాటు శస్త్ర చికిత్సలు చేస్తూ ప్రాణం పోస్తున్నారు. అత్యవసర వైద్యం కోసం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మూగజీవులను కొండారెడ్డి బురుజు సమీపంలోని బహుళార్థ పశువైద్యశాల కు తీసుకొస్తారు. గత వైఎస్‌ఆర్‌సీపీ పాలనలో వైద్య సేవల్లో ఎలాంటి లోపం లేకుండా అందించారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఆసుపత్రి నిర్వహణ అటకెక్కింది. అధునాతన యంత్ర పరికరాలు మరుగునపడటంతో వైద్య సేవలు అధ్వాన్నమయ్యాయి. గతంలో యజమానులకు ఒక్క రూ పాయి ఖర్చు లేకుండా వైద్య సేవలు అందించారు. నేడు వైద్య సేవలు మినహాయిస్తే.. పరీక్షలు, మందు లు ఇతరత్రా లన్నీ బయటకే రాస్తుండటం గమనార్హం.

సేవలు నిర్వీర్యం

ప్రతి ఉమ్మడి జిల్లాకు ఒక బహుళార్థ పశువైద్య శాల ఉంది. ఒక డీడీ పోస్టు, రెండు ఏడీ పోస్టులు, రెండు వెటర్నరీ అసిస్టెంటు సర్జన్ పోస్టులు ఉన్నాయి. సిబ్బంది పూర్తి స్థాయిలో ఉన్నారు. ప్రధానమైన సమస్య చికిత్సకు ఏది అవసరమైన బయటికి వెళ్లి తెచ్చుకోవాల్సిందే. సాంకేతిక సమస్యల కారణంతో సేవలను నిర్వీ ర్యం చేసినట్లు తెలుస్తోంది. డిజిటల్ ఎక్స్‌రే యూనిట్ ఉన్నా.. కొన్ని నెలలుగా పూర్తిగా మరుగున పడిపోయింది. ఎక్స్‌రే మిషన్ దుమ్ము, ధూళితో నిండిపోయింది. రక్తం, యూరిన్ పరీక్షలను కూడా బయటికే పంపుతున్నారు. ఎక్స్‌రే కోసం గాంధీనగర్‌కు.. రక్త, యూరిన్ పరీక్షలకు గాయత్రీ ఎస్టేటుకు వెళ్లాల్సి వస్తోంది.

అరకొరగా మందులు

ప్రస్తుతం ఆసుపత్రిలో రెండు, మూడు మందులు ఇస్తే.. మరో రెండు, మూడు బయటికి రాస్తున్నారు. ఆసుపత్రిలో సేవలు గాడితప్పినా పశువైద్యశాల డీడీ, జిల్లా పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ పట్టించుకున్న దాఖలాలు లేవు. కాస్త చొరవ తీసుకుంటే అన్ని రకాల వైద్య సేవలు బయటకు పంపకుండానే అందించే అవకాశం ఉన్నప్పటికీ పట్టించుకోకపోవడం గమనార్హం. ఆసుపత్రికి ప్రతి రోజు కుక్కలు, పిల్లులు, పందులు ఇతర పశువులను 130 వరకు తెస్తుంటారు. ఇందులో 10 శాతం వాటికి ఎక్స్‌రే అవసరం అవుతుంది. మరో 10 శాతం వాటికి రక్త, పేడ పరీక్షలు నిర్వహిస్తారు. ఎక్స్‌రే తీయడానికి రూ.800–రూ.1000 వరకు ఖర్చు అవుతుంది. పరీక్షలకు మరో రూ.1000 వరకు వెచ్చించాల్సి వస్తోంది.

అన్నీ బయటికే రాస్తున్నారు



దాదాపు పది నెలల ఒంగోలు జాతి కోడెదూడ కొద్ది రోజులుగా అనారోగ్యంతో ఉంది. మేత కూడా తినడం లేదు. స్థానిక పశువైద్యులలో చూపించినా ఫలితం లేకపోయింది. మెరుగైన వైద్యం కోసం కర్నూలు బహుళార్థ పశువైద్యశాలకు తీసుకొచ్చాం. డాక్టర్లు వైద్య సేవలు బాగా అందిస్తున్నా మందులు, సూదులు, పరీక్షలు అన్నింటినీ బయటికే రాశారు. దీనివల్ల ఖర్చు ఎక్కువగానే వచ్చింది.

– నారాయణ, మిట్టకందాల, పాములపాడు మండలం

ఈ పరిస్థితిని చూస్తే ఆసుపత్రి అధికారులు రైతులపై ఏ స్థాయిలో ఆర్థిక భారం మోపుతున్నారో స్పష్టమవుతోంది. కుక్కలు, పిల్లులకు ఉచితంగా టీకాలు వేయాల్సి ఉన్నా.. వాటిని కూడా బయటకే రాస్తుండటం విమర్శలకు తావిస్తోంది.

మరుగున పడిన ప్రతిపాదనలు

బహుళార్థ పశువైద్యశాలను సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిగా మార్పు చేయాలనే ప్రతిపాదన ఉంది. ఇందులో భాగంగానే రూ.4 కోట్లతో అన్ని రకాల సదుపాయాలతో జీ+3 అంతస్తుల భవనాన్ని నాబార్డు నిధులతో నిర్మించారు. 24 గంటలు మూగజీవులకు వైద్య సేవలు అందించే విధంగా డాక్టర్లను కూడా పెంచాలనే ప్రతిపాదన ఉంది. ఈ ప్రతిపాదనలు మరుగున పడిపోగా.. స్థాయికి తగినట్లుగా కూడా సేవలు అందించకపోవడం గమనార్హం.

మెరుగైన వైద్య సేవలే అందిస్తున్నాం

బహుళార్థ పశువైద్యశాలలో మెరుగైన వైద్య సేవలే అందిస్తున్నాం. డిజిటల్ ఎక్స్‌రే యూనిట్‌లో సాంకేతిక సమస్యలు ఏర్పడటంతో కొంత అంతరాయం కలిగింది. ఇతర పరీక్షల కోసం శాంపిల్స్ తీసి వ్యాధి నిర్ధారణ కేంద్రానికి పంపుతున్నాం. అక్కడ చేయని వాటిని బయటకు పంపుతున్నాం.

– డాక్టర్ హేమంత్‌కుమార్, డిప్యూటీ డైరెక్టర్, బహుళార్థ పశువైద్యశాల, కర్నూలు

సస్పెన్షన్ అధికారుల హల్‌చల్

- విధుల్లోకి తీసుకోవాలని ఎస్‌ఈతో వాగ్వాదం

శ్రీశైలంప్రాజెక్ట్: జలవనరుల శాఖలో సస్పెండ్ అయిన ఇద్దరు ఇంజినీర్లు గురువారం శ్రీశైలం ప్రాజెక్ట్ ఎస్‌ఈ కార్యాలయం వద్ద హల్‌చల్ చేశారు. అక్కడి ఉద్యోగులు తెలిపిన వివరాల మేరకు.. ఆరు నెలల క్రితం ప్రభుత్వం నిర్వహించిన బదిలీల ప్రక్రియలో భాగంగా కర్నూలు జలవనరుల శాఖలో డిప్యూటీ చీఫ్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న సుగాలి లక్ష్మానాయక్‌ను శ్రీశైలం ప్రాజెక్ట్ డిప్యూటీ ఎస్ఈగా, తెనాలి కేడబ్ల్యూయూ డివిజన్‌లో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పని చేస్తున్న శంకారపు మల్లికార్జునను సీఅండ్‌బీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే వారు ఆయా స్థానాల్లో విధుల్లో చేరకుండా కాలయాపన చేశారు. దీనిపై స్పందించిన స్పెషల్ చీఫ్ సెక్రటరీ జి.సాయిప్రసాద్ ఈనెల 18వ తేదీన ఇద్దరినీ సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే సస్పెండైన ఇద్దరు అధికారులు గురువారం శ్రీశైలం ప్రాజెక్ట్ ఎస్ఈ శ్రీరామచంద్రమూర్తి వద్దకు వచ్చి తమను విధుల్లో చేర్చుకోవాలని అడిగారు. అందుకు ఎస్ఈ నిరాకరించడంతో లక్ష్మానాయక్, మల్లికార్జునలు దుర్భాషలాడారు. అయితే సస్పెండైన ఉద్యోగులు సస్పెన్షన్ తొలగింపు ఉత్తర్వులు తెచ్చుకోకుండా విధుల్లోకి చేర్చుకోమనడం విడ్డూరంగా ఉందని శ్రీశైలం ప్రాజెక్ట్ ఏపీ గజిటెడ్, నాన్ గజిటెడ్ ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు దాసరి మల్లికార్జున, సీహెచ్ మధు అన్నారు. నిబంధనల మేరకు విధుల్లోకి తీసుకోని ఎస్ఈపై నోరుపారేసుకోవడం తగదన్నారు.

టీడీపీ నేతలా.. మజాకా

- డీసీసీబీలో అవుట్ సోర్సింగ్ ఏజెన్సీ టెండర్లపై రభస
- అతి తక్కువ సర్వీస్ చార్జీ కోట్ చేసిన జీవీఎల్‌కు సంస్థకు ఖరారు
- తమ వారికే ఏజెన్సీ దక్కాలని టీడీపీ నేతల పట్టు



కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లా సహకార కేంద్రబ్యాంకు అధికారులపై టీడీపీ నాయకులు జులుం ప్రదర్శిస్తున్నారు. అవుట్ సోర్సింగ్ ఏజెన్సీ తమ వాళ్లకే దక్కాలని, మళ్లీ టెండర్లు పిలవాలని, లేదా కర్నూలు, నంద్యాల జిల్లాల్లో ఏదో ఒకటి తమ వాళ్లకే ఇవ్వాల్సిందేనని ఏకంగా సీఈవో చాంబరులోకి చొచ్చుకెళ్లి రభస సృష్టించారు. జిల్లా సహకార కేంద్రబ్యాంకు అధికారులు అవుట్ సోర్సింగ్ ఏజెన్సీ కోసం ఇటీవల టెండర్లు పిలిచారు. టెండరుదారుల సమక్షంలోనే గురువారం టెండర్లు ఓపెన్ చేశారు. ఐదుగురు టెండర్లు వేయగా.. టెక్నికల్ బిడ్‌లో ఇద్దరికి మాత్రమే అర్హత లభించింది. ఫైనాన్షియల్ బిడ్‌లో ఎవ్వరు తక్కువ సర్వీస్ చార్జీలతో అవుట్ సోర్సింగ్ ఏజెన్సీని నిర్వహిస్తామని కోట్ చేసి ఉంటారో వారికే టెండరు ఖరారు చేస్తారు. డీసీసీబీలో జీవీఎల్ మ్యాన్ పవర్ సప్లయి ఏజెన్సీస్ సర్వీస్ చార్జీ కేవలం 2 శాతం మాత్రమే కోట్ చేసింది. మరో ఏజెన్సీ 8 శాతం సర్వీస్ చార్జీలను కోట్ చేసింది. దీంతో డీసీసీబీ అధికారులు జీవీఎల్ సంస్థకే టెండరు ఖరారు చేశారు. డీసీసీబీలో 106 మంది అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు ఉన్నారు. వీరందరూ ఈ సంస్థ తరుపున పని చేస్తారు. ఈ సంస్థ మూడు నాలుగేళ్లుగా పని చేస్తోంది. ఎలాంటి రిమార్కులు లేవు. టెండర్లు పిలిచే ముందు ఈ సంస్థను కూడా అవుట్ సోర్సింగ్ ఏజెన్సీ నుంచి తప్పించారు. తాజాగా పిలిచిన టెండర్ల ద్వారా అతి తక్కువ సర్వీస్ చార్జీ కోట్ చేయడం ద్వారా ద్వారా మళ్లీ దక్కించుకున్నారు. జీవీఎల్ సంస్థపై వైఎస్సార్‌సీపీ ముద్ర వేసిన నందికొట్కూరు, పాణ్యం ఎమ్మెల్యే వర్గీయులు బ్యాంకు అధికారులపై అక్కసు వెల్లగక్కుతున్నారు. పథకం ప్రకారం జీవీఎల్‌కే టెండరు దక్కే విధంగా చేశారని ఆక్రోశం వ్యక్తం చేశారు. కాగా పాలక వర్గాలు ఉంటే వాళ్లు చెప్పిన సంస్థను ఎంపిక చేసే అవకాశం ఉంది. అయితే ప్రస్తుతం పాలక వర్గాలు లేవు. జాయింట్ కలెక్టర్ నవ్య అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జ్‌గా కొనసాగుతున్నారు. ఈ సమయంలో పారదర్శకంగా అవుట్ సోర్సింగ్ ఏజెన్సీని టెండరు ద్వారా ఎంపిక చేశారు. దీనిని టీడీపీ నేతలు జీర్ణించుకోలేక అధికారులపై జులుం ప్రదర్శిస్తున్నరనే విమర్శలు ఉన్నాయి. టీడీపీ నేతల చేసిన రభసను బ్యాంకు అధికారులు మూడవ పట్టణ పోలీసుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలుస్తోంది.

అడవి తల్లి చల్లగా ఉండాలని..



- ఐస్‌క్రీమ్ పుల్లపై 90 సూక్ష్మ చిత్రాలు ఆవిష్కరణ

ప్రపంచ అటవీ దినోత్సవాన్ని పురస్కరించుకొని నంద్యాల చిత్రకారుడు చింతలపల్లె కోటేష్ ఐస్‌క్రీమ్ పుల్లపై 90 సూక్ష్మ చిత్రాలు గీచి అబ్బుర పరిచారు. మైక్రో పెన్ను, బ్రష్‌తో పోస్టర్ కలర్స్ ద్వారా ఐస్‌క్రీమ్ పుల్లపై 3 గంటలు శ్రమించి 90 సూక్ష్మ చిత్రాలు వేశారు. చిత్రంలో అడవిలో చెట్లు లేక వన్యప్రాణులు అలమటించిపోయే వేదన, వారి వేదనను వనదేవతకు మొరపెట్టుకోవడం, వన దేవత కన్నీరు పెట్టడం, చెట్లు, నీరు లేక వన్యప్రాణులు విలవిలలాడుతుండటం, ఎండిపోయిన చెట్లు, జంతు కళేబరాలు, నరికివేసిన చెట్లు, తదితరాలతో పాటు జంతువులు, ఖడ్గమృగాలు, నెమళ్లు, కొంగలు, పక్షులు, చేపలు, తాబేళ్లు, తదితర వన్యప్రాణులను సూక్ష్మ చిత్రాల్లో చూపించారు.

– నంద్యాల(అర్బన్)

జననీ బ్యాంకు చెక్ బౌన్స్

అందుబాటులో లేని బ్యాంకు సీఈఓ

- రూ.2 కోట్ల డిపాజిట్లు సేకరించిన సంస్థ
- పోలీసులను ఆశ్రయించిన బాధితుడు

కోవెలకుంట్ల: పట్టణంలోని జననీ మ్యాక్స్ లిమిటెడ్(జననీ మహిళా బ్యాంకు) సంస్థ ఇచ్చిన చెక్ బౌన్స్ కావడం ఖాతాదారులను ఆందోళనకు గురిచేస్తోంది. కోవెలకుంట్లలోని గడ్డివీధి సమీపంలో 2021వ సంవత్సరంలో జననీ మ్యాక్స్ లిమిటెడ్ సంస్థ ఏర్పాటైంది. పట్టణానికి చెందిన వందలాది మహిళలు ఈ సంస్థలో లక్షలాది రూపాయలు డిపాజిట్లు చేశారు. డిపాజిట్లపై రూపాయి వడ్డీ, డిపాజిట్లపై రుణం తీసుకుంటే రూ.1.50 చొప్పున వడ్డీ వసూలు చేస్తూ నాలుగు సంవత్సరాల నుంచి సంస్థను నిర్వహిస్తున్నారు. కోవెలకుంట్లతోపాటు నంద్యాల, బనగానపల్లె, ఆళ్లగడ్డ, చాగలమర్రి ప్రాంతాల్లో బ్రాంచ్ ఆఫీసులు ప్రారంభించి లావాదేవీలు కొనసాగిస్తున్నారు. కోవెలకుంట్లకు చెందిన బాలసుబ్బయ్య అనే రిటైర్డ్ ఉద్యోగి పట్టణానికి చెందిన సంస్థలో రూ.6 లక్షలు డిపాజిట్ చేశాడు. బాండ్లు మెచ్యూర్ కావడంతో అతనికి అసలు వడ్డీతో కలిపి రూ.7.42 లక్షల నగదు సంస్థ నుంచి రావాల్సి ఉంది. ఈ మేరకు బ్యాంకుకు వెళ్లగా చెక్ ఇచ్చారు. నగదు విత్‌డ్రా చేసుకునేందుకు గురువారం ఆయన తన సేవింగ్ ఖాతా ఉన్న బ్యాంకుకు వెళ్లగా జననీ బ్యాంకు ఖాతాలో నగదు లేకపోవడంతో చెక్ బౌన్స్ అయింది. అవాక్కయిన రిటైర్డ్ ఉద్యోగి వెంటనే జననీ బ్యాంకు వద్దకు వెళ్లగా తాళాలు వేసి ఉన్నాయి. సీఈఓ వెంకటరమణకు ఫోన్ చేయగా సెల్ స్విచ్‌ఆఫ్ రావడంతో వెంటనే స్థానిక పోలీసులను ఆశ్రయించాడు. ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి బ్యాంకుకు సంబంధించిన వ్యక్తులను పిలిపించి విచారించగా.. బ్యాంకులో చాలా మంది రుణాలు తీసుకుని తిరిగి చెల్లించలేదని, ఈ కారణంగానే సమస్య తలెత్తినట్లు తెలిపారు. సీఈఓను పిలిపించి రిటైర్డ్ ఉద్యోగికి రావాల్సిన డబ్బులు చెల్లిస్తామని, ఒక రోజు గడువు ఇవ్వాలని కోరినట్లు సమాచారం. జనని బ్యాంకు మహిళల నుంచి దాదాపు రూ.2 కోట్లు డిపాజిట్ల రూపంలో సేకరించినట్లు సమాచారం.